
# రంగుల రాట్నం

## ఎన్. శివనాగేశ్వర రావు



**"మీరీమధ్య మారిపోతున్నారు. నా ఉనికిని మరిచిపోతున్నారు" అంది నీహారిక. బేలన్స్ షీట్ వంక తదేకంగా చూస్తున్న అవినాశ్ ఆమాటకు తలెత్తి భార్యవంక సాలోచనగా చూశాడు.**

చాలాకాలం తరువాత భర్త కాస్తంత ప్రశాంతం గా కనిపించాడు. నీహారిక ఆ అవకాశం వదులుకో దలచలేదు. "అవును. మీరెప్పుడూ బిజినెస్ గురించే ఆలోచిస్తున్నారు. నాతో గడిపే క్షణాలే కరువయ్యాయి" అంది.

అవినాశ్ చేతిలోని ఫైల్ పక్కన పెట్టి "నీహా! నేనెందుకింతగా శ్రమిస్తున్నానో నీకు తెలీదా? నేను డబ్బు గడించేది ఎవరికోసం? నీకోసం, పుట్టబోయే పిల్లల కోసం" అన్నాడు.

"మనిషికి డబ్బే ముఖ్యం కాదండి. జీవితంలో అంతకు మించి విలువైనవి ఉన్నాయి."

"అదంతా ట్రాష్. మనిషికి డబ్బే ముఖ్యం. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే డబ్బు లేనివాణ్ని కుక్కకంటే హీనంగా చూస్తారు. నీవు డబ్బు ముఖ్యం కాదంటే నీకు లోకం గురించి తెలీదన్నమాటే!"

"లోతుగా ఆలోచించి చెప్పండి! మీరు గడిస్తున్న డబ్బు మీకు సంతోషాన్నిస్తున్నదా?"

నీహారిక మాటకు అవినాశ్ ఆమెవంక వింతగా చూశాడు. "అదేం మాట నీహా? ఈ ఖరీదైన బంగ్లాలు, ఏసీ గదులు, విమానాల్లో ప్రయాణాలు-ఇవి సంతోషంగా జీవించడం కాదా? ఈ సంతోషం ఎక్కడిది? డబ్బు గడించడంవల్ల వచ్చినదే!" అన్నా డతను.

అది విన్న నీహారిక భర్త వంక జాలిగా చూసింది. ఆ చూపులోని భావం అవినాశ్ సరిగానే అర్థం చేసుకున్నాడు. 'ప్రతిదానికీ ఒక హద్దు ఉంటుందండీ. ధనార్జనకూ అంతే. అంతకు మించి గడించ డంలో డబ్బు సంపాదిస్తున్నామన్న తృప్తి మినహా అదనంగా పొందే ఆనందం ఉండదు. అందుకోసం భార్యాపిల్లల్ని మరిచి... డబ్బు గడించుకోవడం అవివేకమే అవుతుంది.'

నీహారిక చెప్పింది విన్న అవినాశ్ మరిక వాదం అనవసరం అన్నట్లు ఆమె వంక చూసి "సరే! నీవు చెప్పినట్లే నాకు డబ్బు గడించడంలోనే ఆనందం ఉందనుకో!" అని ఇక నీతో మాట్లాడ వలసింది ఏం లేదన్నట్లు మళ్లీ బిజినెస్ ఫైల్ చేతిలోకి తీసుకున్నాడు.

అది గమనించిన నీహారిక చిన్నగా నిట్టూర్చి అక్కడినుంచి లేచి బెడ్‌రూమ్‌లోకి నడిచింది.

అవినాశ్ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడ్డం ఆమె చెవిన పడింది. 'చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం తేడా వచ్చినా లక్షల్లో నష్టం వస్తుంది' అని హెచ్చరిస్తున్నాడు.

'ఇతనికి డబ్బే సర్వస్వం అయిపోతున్నది. అంతకు మించింది ఉన్నదన్నది తెలియ జేయకపోతే త్వరలోనే డబ్బు మనిషయిపోతాడు' అనుకుంది నీహారిక.

మరునాటి ఉదయం అవినాశ్ హడావుడిగా తయారైపోయి, "నీహా! నీకు చెప్పడం మరిచాను. నేను కెనడా వెళ్తున్నాను. వారంరోజుల్లో వచ్చేస్తాను" అన్నాడు.

అతను కెనడా ప్రయాణం గురించి చెప్పడం మరిచిపోలేదని, చెప్తే తను వారిస్తుందని కావాలనే చెప్పలేదని ఆమె తేలిగ్గానే గ్రహించింది. అందుకే మౌనంగా ఉండిపోయింది.

ఆమె మౌనం అవినాశ్‌కి ఇబ్బంది కలిగించింది. అతనామెను దగ్గరకు తీసుకుని "నీహా! నేను డబ్బు సంపాదనలోపడి ఎక్కువ సమయం బిజినెస్ వ్యవహారాల్లో గడుపు తున్నమాట నిజం. కానీ నిన్ను మాత్రం మరచిపోలేదు. నీవు ప్రతిక్షణం నా హృదయంలో మెదులుతుంటావు. ఇది మాత్రం నిజం. నన్ను నమ్ము. ప్లీజ్!" అన్నాడు.

ఆమె అతని హృదయం మీద తలవాల్చి "నమ్ముతాను. అయితే మీరు నాకో ప్రామిస్ చేయాలి" అంది.

"చెప్పు" అన్నాడతను సంతోషంగా.

"మీరు కెనడా నుంచి వచ్చాక వారం రోజులు పూర్తిగా నాతోనే గడపాలి. ఆ వారం రోజులూ పొరపాటున కూడా బిజినెస్ వ్యవహారాల జోలికి పో కూడదు" అంది.

అవినాశ్ ఇబ్బందిగా ముఖం పెట్టి "ముఖ్యమైన ప్రాజెక్టు వర్క్ ఉంది. అర్థం చేసుకో. రెండు నెలల తరువాత తప్పక నీ కోరిక తీరుస్తాను" అన్నాడు.

నీహారిక అతనికి దూరంగా జరిగింది. అది గమనించిన అవినాశ్ "ఓకే. అలానే చేస్తాను. అయితే వారం రోజులు కాదు. రెండు రోజులు నీ తోనే గడుపుతాను. ప్రామిస్!" అన్నాడు.

ఆ మాటకు నీహారిక ఎంతో సంతోషించింది. "థాంక్యూ!" అని ఆనందంతో అతని బుగ్గ ముద్దాడింది.

"నీవు ముద్దిచ్చి పంపుతున్నావంటే కెనడా ప్రయాణం సక్సెస్ అయినట్లే. నీకు విలువైన గిఫ్ట్ తెస్తాను" అన్నాడు.

"నాకు గిఫ్ట్లు వద్దు, ఏం వద్దు. మీ ప్రామిస్ నిలబెట్టుకోండి. మీరు నాతో గడిపే క్షణాలే నాకు విలువైన కానుకలు!" అన్నదామె.

"నేను మాట తప్పను!" అవినాశ్ బయలుదేరి పోయాడు.

పది రోజుల తరువాత అవినాశ్ తన మాటకు కట్టుబడి ఆమెతో రెండు రోజులు గడపడానికి

సిద్ధపడి "ఎలా గడపాలి? ఎక్కడ గడపాలి?- అన్నది నీ కే వదిలేస్తున్నాను" అన్నాడు.

"మా బాబాయిగారి ఊరు వెళ్దాం" అంది నీహారిక. అవినాశ్‌కి నీహారిక బాబాయి ప్రభాకరం జ్ఞాపకానికి వచ్చాడు. వాళ్లుండేది చిన్న పల్లెటూరు. "ఆ పల్లెటూళ్లో ... ఆ పెంకుటింట్లో రెండు రోజులు గడపడం చాలా కష్టం" అన్నాడు.

"మీరు చూడవలసింది ఊరు, ఇల్లు కాదు! వాళ్లు చూపే ప్రేమ.. అభిమానం" అంది నీహారిక.

"సారీ! నా వల్ల కాదు!" అన్నాడు అవినాశ్.

నీహారిక ముఖం కళ తప్పింది. "అయితే మీ ఇష్టం" అంది.

"నీహా! ప్లీజ్! బాధపడకు. ఈ ప్రయాణం నీకోసం. నీవు చెప్పినట్లే చేస్తాను. అయితే చిన్న మార్పు. అక్కడ ఓ పూట ఉండి సిటీ వెళ్లిపోదాం. అక్కడ హేపీగా గడుపుదాం" అన్నాడు.

నీహారిక అందుకు ఒప్పుకుంది. మరునాడే ఇద్దరూ కారులో నీహారిక బాబాయి ఉండే ఊరు బయలుదేరారు. తమిద్దరి మధ్య డ్రైవర్ ఉండడం ఇష్టం లేక అవినాశ్ తనే స్వయంగా కారు నడప సాగాడు. నీహారిక అతని పక్కనే భుజాన్ని ఆనుకుని కూర్చుంది. భర్తతో కలిసి ప్రయాణం చేయడం ఆమెకెంతో ఆనందాన్నిస్తున్నదని ఆమె ముఖకవళిక లను బట్టి తెలిసిపోతున్నది.

మార్గమధ్యాన ఓ చిన్న పల్లె తగిలింది. అక్కడేదో సంబరం జరుగు తున్నట్లుంది. పల్లె వాసులు గుంపులుగుంపులుగా కనిపించారు. ఆ దృశ్యం చూసిన నీహారిక "కొంచెం సేపు కారు ఆపండి" అంది. అవినాశ్ కారు ఆపాడు. ఇద్దరూ కిందికి దిగారు.

"అలా వెళ్దామా?" అడిగింది నీహారిక.

"వద్దు. దూరంనుంచే చూద్దాం" అన్నాడు అవినాశ్. కొంచెం దూరంలో జోరుగా తిరుగు తున్న రంగులరాట్నం మీద పడింది నీహారిక దృష్టి. కొద్ది సేపటి తరువాత "మనిద్దరం రంగులరాట్నం ఎక్కి తిరుగుదాం" అని ప్రపోజ్ చేసింది నీహారిక.

అవినాశ్ భార్యవంక ఆశ్చర్యంగా చూసి "నీవు మన స్టేటస్ మరిచి పోయావు. ఒక బిజినెస్ మేగ్నెట్ భార్యవై ఉండి చీప్‌గా అటువంటి లేబర్ వాళ్ల మధ్య రంగులరాట్నం ఎక్కడం ఎంత సిగ్గుచేటు?" అన్నాడు.

'ఆ లేబర్ వాళ్లంటే మీకెందుకంత చిన్న చూపు? కష్టించి పని చేయడం తప్పేం కాదుకదా!' అంది.

"నాకిష్టం లేదు. కావాలంటే నీవు వెళ్లు" అన్నాడు అవినాశ్.

"మీరు కెనడా వెళ్లేటప్పుడు ఖరీదైన గిఫ్ట్ తెస్తానంటే వద్దన్నాను. ఇప్పుడీ గిఫ్ట్ ఇవ్వండి" అంది నీహారిక.

"నీహా! ఈ మధ్య నీవు వింతగా ప్రవర్తిస్తున్నావు. లక్షలు పెట్టి తెచ్చే గిఫ్ట్ కన్నా ఆఫ్ట్రాల్ ఈ రంగుల రాట్నం ఎక్కడం నీకంత ఆనందాన్నిస్తుందా?" అన్నాడతను.

"అవును" అందామె స్థిరంగా.

"ఈ ప్రయాణం నీకోసం. నీ మాట ఎందుకు కాదనాలి? పద!" అన్నాడతను.

ఇద్దరూ సంబరం జరుగుతున్న చోటికి నడిచారు. తన దగ్గరకు వచ్చిన దొరబాబు వంటి అవినాశ్‌నూ, దొరసాని వంటి నీహారికనూ చూసి రంగుల రాట్నం వాడు తెగముచ్చట పడిపోయాడు. "రంగుల రాట్నం తిరుగుతారా?" అని అడిగాడు. నీహారిక తల ఊపింది.

ఆ రంగులరాట్నం పాతకాలం నాటిది. రంగులు వెలిసిపోయాయి. ఆ రాట్నానికి గుర్రం బొమ్మలు వేలాడుతున్నాయి. మధ్యలో రెండు చోట్ల మాత్రం ఉయ్యాల బల్లలున్నాయి.

నీహారిక ఉయ్యాల బల్ల దగ్గరికి నడిచింది. అది ఎత్తుగా ఉండడాన ఎక్కి కూర్చోలేకపోయింది. ఒకటి రెండు సార్లు ఎగిరి కూర్చునే ప్రయత్నం చేసింది కాని, వీలు పడలేదు. సిగ్గుతో ఆమె ముఖం అరుణిమ దాల్చింది.

"నీవు బరువు పెరిగినట్లు ఇప్పటికైనా గమనించావా?" అని అవినాశ్ ఆమె భుజం పట్టుకుని నడుం మీద చేయి వేసి పైకెత్తి కూర్చోబెట్టాడు. తరువాత తను చలాకీగా ఎగిరి ఆమె సరసన కూర్చున్నాడు. రంగులరాట్నం తిరగడం మొదలయింది. ఆ వేగానికి లోకమంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించి నీహారిక భయంతో భర్త నడుం చుట్టూ చేయి వేసి అతని భుజం మీద తల వాల్చింది.

అవినాష్‌కి ఆ క్షణం తెలియని ఆనందం కలిగింది. భార్యను పొదివి పట్టుకున్నాడు. ఆ క్షణం అతను అన్నీ మరిచిపోయాడు. తన వ్యాపారం, లావాదేవీలు, లాభనష్టాలు, సమస్తం మరిచిపోయాడు. ఈ జగతిన ఉన్నది తను, నీహారికే అన్నట్లు మురిసిపోయాడు.

రంగులరాట్నం వేగం తగ్గింది. అది ఆగాక అవినాశ్ కిందికి దూకి, నీహారికను కిందికి దింపాడు. జేబులోంచి పర్సు తీసి, "ఎంత?" అని అడిగాడు.

"మనిషికి రూపాయి బాబూ!" అన్నాడు రంగుల రాట్నం వాడు. అవినాశ్ పదిరూపాయల కాగితం తీసిచ్చాడు.

"చిల్లర లేదు బాబుగారూ!" అన్నాడతను.

"పర్లేదు ఉంచుకో" అని ముందుకు కదిలాడు.

తన పక్కన నడుస్తున్న నీహారిక చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు అవినాశ్.

"మరిక వెళ్దామా?" అందామె. అతనామె కన్నుల్లోకి చూస్తూ "కొంచెం సేపు ఇక్కడే తిరుగుదాం" అన్నాడు. ఆమె అతని వంక ఆశ్చర్యంగా చూసింది.

పులివేషాలు, కోలాటాలు. చిన్నచిన్న మేజిక్కు లు, గారడీలు, మిఠాయి దుకాణాలు... అన్నీ చూసుకుంటూ ఇద్దరూ చాలా సేపు తిరిగారు.

ఓ అంగడి దగ్గర అవినాశ్ భార్య కోసం రంగు రంగుల మట్టిగాజులు, బొట్టుబిళ్లలు కొన్నాడు. నీహారిక అవి అందుకుంటూ "థాంక్యూ!"అంది. ఇద్దరూ కారు దగ్గరికి వెళ్లారు.

కారు బయలుదేరింది.

"ఎలా ఉంది రంగులరాట్నం?" అడిగింది నీహారిక.

అతనామె వైపు చూసి "నీవు చెప్పిందే నిజం నీహా! డబ్బుసంపాదనే జీవనసర్వస్వం కాదు. డబ్బు కంటే విలువైనవి, ముఖ్యమైనవి జీవితంలో మరి కొన్ని ఉన్నాయి. వేలు ఖర్చు చేసి పొందిన ఆనందం కంటే రూపాయి ఇచ్చి పొందిన ఈ ఆనందమే ఎక్కువ తృప్తినిచ్చింది" అన్నాడు. అతను నిజాయితీగా తప్పు ఒప్పుకోవడం నీహారికకు నచ్చింది.

కారు నీహారిక బాబాయి ఇంటి ముందు ఆగింది. భార్య కారు దిగుతుంటే "నీహా! మనం రెండు రోజులూ ఇక్కడే ఉందాం" అన్నాడు అవినాశ్. ఆమె భర్త వంక తృప్తిగా చూసింది.

